విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

శుక్రవారం 19 సెప్టెంబరు 2025 | 8 పేజీలు

జగనన్న కాలనీ
చిట్టడవిలా మారింది

- అధ్వానంగా రహదారులు
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డా
- మొరాయిస్తున్న బోర్లు
- అరకొర సౌకర్యాలతో అవస్థలు
- కాలనీ అభివృద్ధికి సహకరించని అధికారులు
- కొత్తవాటికి మోక్షం ఎప్పుడో

విశాలాంధ్ర -కంభం : నిరుపేదలకు గూడు కలగానేమారింది. మండలంలోని కంభం, కందులాపురం, చిన్నకంభం గ్రామాల్లో జగన్ ప్రభుత్వంలో 600 పైగా జగనన్న గృహాలు మంజూరు అయ్యాయి. వాటిలో 200 గృహాలకు పైగా పూర్తిఅయి లబ్ధిదారులు నివసిస్తున్నారు. మిగిలిన గృహాలకు గ్రహణం పట్టినట్లు అసంపూర్తిగానే మిగిలినవి దర్శనమిస్తున్నాయి. కందులాపురం గ్రామసమీపంలోని కంభం నుండి తర్లుపాడు వెళ్లే ప్రధాన స్టేట్ హైవే ప్రక్కనే ఉన్న 150 గృహాల్లో ఒక్కరు మాత్రమే నివసిస్తున్నారు. మిగిలిన లబ్ధిదారుల్లో ఏఒక్కరు రాక మొండిగోడలు ఎక్కిరిస్తున్నాయి. అరకొర కట్టిన ఇళ్లల్లో సరైన వసతి లేక పోవడంతో సాహసించడంలేదు. దీంతో ఆయా గృహాల్లో కొందరు ఆకతాయిలు రాత్రివేళల్లో అసాంఘిక కార్య క్రమాలకు పాల్పడుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు.

చిట్టడివిని తలపిస్తున్న వైనం : కాలనీలో చిల్లచెట్లు మొలచి దారులు లేక గృహాల మధ్యలో చిల్లచెట్లు ఏపుగాపెరిగి అడవిని తలపిస్తుంది. పునాదులువద్ద, పిల్లర్లు వేసిన చోట బేస్ మట్టంలో ముళ్లచెట్లు మొలచి ఉన్నాయి. నిర్మాణం చేపట్టాలన్న ముళ్లచెట్లతో సాహసం చేయలేక వదులుకున్న వారు ఉన్నారు.

అధ్వానంగా రహదారులు : పేరుకే కాలనీ, రహదారులు లేక నిర్మాణం చేపట్టిన మిగతా 2 లో ...

మెరుగైన సేవలు అందిద్దాం

- శాంతి భద్రతల పరిరక్షణే ప్రథమ కర్తవ్యం
- జిల్లాలో పేకాటలు, అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకోకుండా కఠిన చర్యలు చేపట్టాలి
- జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

విశాలాంధ్ర -ఒంగోలు : బాధ్యతలు స్వీకరించిన జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు గురువారం ప్రకాశం జిల్లాలోని అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సి.ఐలు తదితర పోలీసు అధికారులతో పోలీస్ కార్యాలయంలో గెలాక్సీ హాలులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ పరిధిలో గల పరిస్థితులు, భౌగోళికల ప్రదేశాల గురించి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అంశాలు, సర్కిల్ పరిధిలో పోలీస్ స్టేషన్‌లు, వారు పనిచేయుచున్న కాలపరిమితి, జిల్లా సరిహద్దు ప్రాంతాల వివరాలు, కేసులు ఎక్కువగా నమోదు అయ్యే ప్రాంతాల వివరాలు గురించి సంబంధించి అధికారులతో జిల్లా ఎస్పీ చర్చించారు. అనంతరం జిల్లాలో మిగతా 2 లో ...

హైదర్ క్లబ్ భూ కబ్జాపై
డీఆర్ఓ విచారణ
4 లో..

మోదీ పాలనలో
అభివృద్ధి శూన్యం
మాజీ కేంద్రమంత్రి చింతామోహన్

విశాలాంధ్ర -ఒంగోలు : 11 సంవత్సరాల మోడీ పాలనలో దేశంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని మాజీ కేంద్రమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతా మోహన్ విమర్శించారు. ఒంగోలులోని ఎంసీప భవన్లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 11 ఏళ్ల క్రితం ఎన్నికల్లో బిజెపి రెండు వాగ్దానాలు ఇచ్చింది. ప్రతి ఇంటికీ 15 లక్షల రూపాయలు ఇస్తామన్నారు. ఇప్పటివరకు నయా పైసా రాలేదన్నారు.సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారు. 11 ఏళ్లలో 22 కోట్ల ఉద్యోగాలు రావాలి. వచ్చిందా?? అని ప్రశ్నించారు. నిరుద్యోగుల పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఎంటెక్ చదివిన నిరుద్యోగులు డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. బిఎ చదివిన నిరుద్యోగులు పారిశుద్ధ్య కార్మికులుగా ఉన్నారన్నారు.ఏపీలో కంటే, తమిళనాడులో పెట్రోల్, డీజిల్ ఎనిమిది రూపాయలు తక్కువ అన్నారు.రూ.14.5 లక్షల కోట్ల రూపాయలు బ్యాంకులు రుణమాఫీ చేశారు. ఎన్ పి ఏ లు100 కోట్లు రూపాయలు పైబడిన ఎన్పీఏ లను రుణమాఫీ చేశారన్నారు. తిరుపతి, వైజాగ్ పర్యటనకు వచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందిస్తారేమోనని అనుకున్నాను. ఆమె మౌనంగా ఉన్నారన్నారు. 1991లో కాంగ్రెస్ పార్టీ, మన్మోహన్ సింగ్ ఆర్థిక సంస్కరణల వల్ల దేశాన్ని ముందుకు తీసుకెళ్లారు. ఆయన తెచ్చిన ఆర్థిక సంస్కరణల వల్ల, అమెరికా, చైనా తర్వాత మిగతా 2 లో ...

సూర్యలంక బీచ్ పెస్టివల్‌కు
పటిష్ఠ బందోబస్తు

- 27న సూర్యలంకకు సీఎం చంద్రబాబు
- 26,27,28 తేదీల్లో నిర్వహణ
- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్

విశాలాంధ్ర - బాపట్ల : బీచ్ ఫెస్టివల్ వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. సూర్యలంక సముద్ర తీరంలో బీచ్ పెస్టివల్ నిర్వహించే ప్రదేశాన్ని తీరంలో యాత్రికుల వాహనాల పార్కింగ్, వీఐపీ వాహనాల పార్కింగ్, కాన్వాయ్ ప్రయాణించి మార్గాన్ని, సభా వేదిక, స్టాల్స్ ఏర్పాటు చేసే ప్రదేశాన్ని, హెలిపాడ్, సూర్యలంక మెరైన్ పోలీస్ స్టేషన్‌లను జిల్లా ఎస్పీ పరిశీలించారు. యాత్రికులు బీచ్ ఫెస్టివల్ వేడుకలను చూసేందుకు విచ్చే యాత్రికుల వాహనాల పార్కింగ్ ప్రదేశాన్ని మరింతగా విస్తరించవలసిన అవసరం ఉందని అధికారులకు జిల్లా ఎస్పీ తెలిపారు. వాహనాల పార్కింగ్ ప్రాంతాన్ని సెక్టార్లుగా విభజించుకుని సెక్టార్‌లోకి వెళ్లే వాహనం వచ్చే వాహనాలకు అంతరాయం కలగకుండా మార్గాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. విఐపి కాన్వాయి ప్రయాణించే మార్గం, సభా వేదికను పరిశీలించారు. ఆ ప్రదేశాలలో తీసుకోవలసిన భద్రతాపరమైన చర్యల గురించి అధికారులకు వివరించారు. సూర్యలంక సముద్ర తీరాన్ని పరిశీలించి బీచ్ ఫెస్టివల్‌కు యాత్రికులు అత్యధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున దానికి అనుగుణంగా ప్రటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 15 మంది గజ ఈతగాళ్లతో పాటు మరి కొంతమందిని నియమించుకోవాలన్నారు. నిర్దిష్ట లోతులలో జెండాలు ఏర్పాటు చేసి అక్కడ పడవలలో గస్తీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. పర్యాటక, ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయంగా వ్యవహరిస్తూ బీచ్ ఫెస్టివల్ వేడుకలు చూసేందుకు వచ్చే యాత్రికులకు అసౌకర్యం తలెత్తకుండా తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల డిఎస్పి జి.రామాంజనేయులు, ఎస్బి ఇన్స్పెక్టర్ జి నారాయణ, బాపట్ల రూరల్ ఇన్స్పెక్టర్ కె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్పీని కలసిన ఎంపీ మాగుంట

విశాలాంధ్ర- ఒంగోలు : ప్రకాశం జిల్లా నూతన ఎస్పీగా ఇటీవల భాధ్యతలు చేపట్టిన హర్షవర్ధన్ రాజుని ఆయన కార్యాలయంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

చట్టాన్ని అతిక్రమించే వ్యక్తులపై ఉక్కుపాదం

జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్

విశాలాంధ్ర - బాపట్ల : చట్టాన్ని అతిక్రమించే వారిపై ఉక్కుపాదం మోపాలని జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ పోలీస్ సిబ్బందికి సూచించారు. బాపట్ల పట్టణ రూరల్ పోలీస్ స్టేషన్లను ఎస్పీ గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.పరిసరాలను పరిశీలించి, నిర్వహించు క్రైమ్ రికార్డ్ లను పరిశీలించారు. స్టేషన్ ల పరిధిలో ఎక్కువగా జరిగిన నేరాల గురించి పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలోని నేర సమాచారాన్ని, కేసులలో పురోగతి, ఛార్జ్ షీట్ దాఖలు తదితర వివరాలను సీసీటీఎన్ఎస్ లో ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ వేగవంతంగా నేరాలను ఛేదించాలన్నారు. నేరాలను కట్టడి చెయ్యడం పై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుండి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించరాదని తెలిపారు. మహిళలు, చిన్నపిల్లల పట్ల ఎవరైనా అమర్యాదగా వ్యవహరించిన, కించపరిచే విధంగా ప్రవర్తించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బాపట్ల పట్టణంలో పర్యటించి ట్రాఫిక్ సమస్యల గురించి తెలుసుకొని అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు, బాపట్ల ఎస్.బి సిఐ జి.నారాయణ, బాపట్ల పట్టణ సీఐ రాంబాబు, బాపట్ల రూరల్ సర్కిల్ సిఐ హరికృష్ణ, సీ శ్రీనివాసరావు తదితరులున్నారు.

అభివృద్ధి శూన్యం

(మొదటిపేజీ తరువాయి)

భారతదేశాన్ని నిలబెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు.అనంతపురంలో జరిగిన సూపర్ సిక్స్ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సామాజిక న్యాయం గురించి, తరిమెల నాగిరెడ్డి లాగా ఉపన్యాసం ఇచ్చారు.మీరు నిజంగా సామాజిక న్యాయం కోరుకుంటే, 15 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసింది చాలు. ఇక దిగిపోండి అన్నారు.మాదిగను ఏపీకి ముఖ్యమంత్రిని చెయ్యండి. మీకు కావాలంటే ఢిల్లీలో పెద్ద పదవి తీసుకోండని సూచించారు.కుప్పం నుంచి ఇచ్చాపురం వరకు దళితులు రోడ్లపైకి వచ్చారు. దీనికి కారణం ఎవరు??కారంచేడు వెళ్లి, మాదిగలను చంద్రబాబు నాయుడు ఎప్పుడైనా పరామర్శించారా?? 15 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఏపీకి, ఒంగోలుకు చంద్రబాబు నాయుడు ఏమి చేశారు?? అని ప్రశ్నించారు.మాల, మాదిగలను రెండుగా చెయ్యడం వల్లే, సమైక్యాంధ్రప్రదేశ్ రెండైందన్నారు.తెలంగాణ ప్రాంతానికి చెందిన, మాదిగ సామాజిక వర్గానికి చెందిన దామోదర రాజనర్సింహాని ముఖ్యమంత్రిని చేసి ఉంటే, రాష్ట్రం రెండుగా విడిపోయేది కాదు. దళిత విభజన జరిగి ఉండేది కాదన్నారు.జగన్ కాంగ్రెస్ పార్టీపై అలిగాడు. నన్ను జైల్లో పెట్టిందని అంటాడు.కాంగ్రెస్ పార్టీ జగన్మోహన్ రెడ్డిని జైల్లో పెట్టలేదు. సిస్టమ్ అతన్ని జైల్లో పెట్టింది. పరిపాలనలో పొరపాట్లు జరిగితే, ఇలాగే ఉంటాదన్నారు. యూపీఏ కి మద్దతు ఇచ్చిన, కరుణానిధి కూతురు కనిమొళి కూడా జైలుకు వెళ్లారు. అయినా స్టాలిన్ కాంగ్రెస్ తోనే ఉన్నారన్నారు.శ్రీకాకుళం జిల్లాకు చెందిన వైసిపి మాజీ మంత్రి టిడిపి మాకు శత్రువు అన్నారు. ఆర్ఎస్ఎస్ ఒక సైద్ధాంతిక ప్రమాణికం తెచ్చింది. 75 ఏళ్ళు నిండిన వాళ్ళు ప్రధాని పదవికి, రాజ కీయాలకు అర్హులు కాదని చెప్పింది. అద్వానీ, మురళి మనోహర్ జోషిలను రాజకీయాల నుంచి ఉద్వాసన పలికారు. నిన్ననే ప్రధాని మోదీ 75 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. మోదీని ఎందుకు తప్పించలేదో, ఆర్ఎస్ఎస్ మోహన్ భగవత్ సమాధానం చెప్పాలని చింతామోహన్ డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు విజేంద్ర బహుజన్, పీకా మధుసూదనరావు, మన్నం ప్రసన్న రాజు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి పోలీస్ అధికారి నిరంతరం అప్రమత్తంగా ఉండి, ప్రజలకు పారదర్శకంగా సేవలు అందిస్తూ, జవాబుదారీ తనంతో విధులు నిర్వర్తించాలన్నారు. అదేవిధంగా అసాంఘిక కార్యకలాపాలైన పేకాట, కోడిపందాలు, మట్కా, సింగిల్ నంబర్ వంటివి జరగకుండా చర్యలు తీసుకుంటూ, ఎవరైనా వాటిని నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. చెడు నడతగల వ్యక్తులపై నిఘా వుంచాలని వారి యొక్క కదలికలను, దైనందిన జీవన విధానాన్ని, వారు చేసే పనులను పరిశీలించి, ఏవైనా అనుమానిత చర్యలు ఉంటే వెంటనే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి. ప్రతి ఒక్కరు సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా అందిపుచ్చుకోవాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయడంతో పాటు, గంజాయి మరియు మాదకద్రవ్యాల నిర్మూలనలో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా, మానవతా దృక్పథంతో వ్యవహరించి, చట్టపరిధిలో వారి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. ఒకే సమస్య పునరావృతం కాకుండా చట్టపరిధిలో సరైన పరిష్కారాన్ని చూపించాలని, మహిళ మిస్సింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.డయల్ 112, శక్తి కాల్ సెంటర్ కి వచ్చే ఫోన్ కాల్స్ పట్ల శ్రద్ధ వహించి, సాధ్యమైనంత త్వరగా ఆ కాల్‌కి స్పందించి, పోలీస్ వారి వెంటనే స్పందించారనే భరోసాను బాధితులకు కల్పించాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్లో పలు రిజిస్టర్, కేసు డైరీ మరియు ఇతర రికార్డులను సక్రమంగా నిర్వహించాలని పోలీస్ అధికారులు ఆదేశించారు. ఏదైనా కేసుకు సంబంధించి ఆధారాలను జాగ్రత్తగా భద్రపరచాలని, అదే విధంగా కేసుల దర్యాప్తు సక్రమంగా సమగ్రంగా ఉండేలాచూసుకోవాలన్నారు.

సిసిటిఎన్ఎస్ లో ఎఫ్ ఐ ఆర్ మొదలు కేసు డిస్పోజల్ వరకు ప్రతి ఒక ఫైల్స్ ను అప్లోడ్ చేయాలని సూచించారు. తరచుగా గ్రామాలు/వార్డులను సందర్శిస్తూ విజిబుల్ పోలీసింగ్, ఓపెన్ డ్రింకింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ డ్రైవ్ వంటి కార్యక్రమాలను నిర్వహించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకుని, వారికి కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, వాటి పనితీరును సమీక్షించాలని, డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచాలన్నారు. విధి నిర్వహణ సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన వెంటనే తన దృష్టికి తీసుకువచ్చి తగిన పరిష్కారాన్ని పొందాలన్నారు.

ప్రస్తుతం సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో, అక్కడ వైరల్ అయ్యే సమాచారం నిజనిజాల ప్రకారమే ఉండేలా చూడాలని, అలాగే పోలీస్ అధికారులు విధులు నిర్వర్తించే తీరు ప్రజల్లో నమ్మకం కలిగించేలా ఉండాలని సూచించారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కె.శ్రీనివాసరావు, డిఎస్పిలు ఆర్.శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, నాగరాజు, సాయి ఈశ్వర్ యశ్వంత్, కె. శ్రీనివాసరావు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పొగాకు ధరలతో రైతుల్లో నిరాశ

విశాలాంధ్ర-కొండపి : స్థానిక పొగాకు వేలం కేంద్రంలో పొగాకు ధరలు పొగాకు రైతులను నిరాశ పరుస్తున్నాయి. వేలంకేంద్రం పరిధిలో గురువారం రైతులు 960 పొగాకుబేళ్ళు వేలానికి పెట్టారు. 725 పొగాకు బెల్లు అమ్ముడయ్యాయి. కాగా పొగాకు అత్యధిక ధర ఎఫ్ఎం రకానికి కేజీ 345కి కొనుగోలు చేశారు. లో గ్రేడ్ పొగాకు కేజీ 105 రూపాయలకే వ్యాపారులు కొన్నారు. ఈ సంవత్సరం ప్రకృతి వైపరీత్యాలతో రైతులు పండించిన పొగాకులో మాదు వంతులులో గ్రేడ్ పొగాకే దిగుబడి వచ్చింది. ప్రారంభంలో వ్యాపారులులో గ్రేడ్ పొగాకు అసలు కొనలేదు. దీంతో రైతులు చేసేది లేక, తమ దగ్గర ఉన్న అతి తక్కువ మేలిమి పొగాకును అమ్మకానికి పెట్టుకున్నారు. ఆ సమయంలో కేజీ పొగాకు 230 నుండి 250 రూపాయల వరకే వ్యాపారులు కొనుగోలు చేసి రైతుల కష్టాన్ని దోచుకున్నారు. పొగాకు కొనుగోలు చివరి దశకు రావడంతో ఇప్పుడు మేలిమి పొగాకు కేజీ 345 రూపాయలు ఇస్తున్నారు. గతంలో ఇదే పొగాకుకు వ్యాపారులు, రైతులకు కేజీకి 230 నుండి 250 రూపాయలు మాత్రమే ఇచ్చారు.

చిట్టడవిలా మారింది...

(మొదటిపేజీ తరువాయి)

వారు ఏటు వెళ్లాలో అర్థం కాక అయోమయంలో ఉన్నామని పలువురు వాపోతున్నారు. రోడ్ మార్గం లేక ఉన్నరోడ్డులలో గుంతలు ఉండటంతో కొందరు నిర్మాణాలే వదులు కొన్నామని పేర్కొంటున్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డా : రాష్ట్ర హైవేకు ఆనుకొని ఉన్న, అసంపూర్తిగా ఉన్న జగనన్న గృహాల్లో రాత్రి వేళల్లో పలువురు అసాంఘిక కార్య క్రమాలకు పాల్పడుతున్నట్లు ఈప్రాంత ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు. పట్ట పగలే పేకాట రాయుళ్లకు, మందుబాబులకు అడ్డగా మారిందని వాపోతున్నారు.

మొరాయిస్తున్న బోర్లు : కాలనీలో వేసిన రెండు బోర్లలో ఒకటి పూర్తిగా నిరుపయోగమైంది. ఉన్న ఒక్కబోరు నిత్యం మరమ్మత్తులకు లోనై నీళ్లురాక గృహాలు కట్టుకోవాలన్న నీళ్లులేని పరిస్థితి.

జాతీయఉపాధిహామీ పథకం ద్వారా నిర్మించిన పశువుల తొట్టిలో నీళ్లు లేక గేదెలకు కాపరులు తొట్టిలో వదిలి వాటిని కడుగుతున్నారు. దీంతో జీవాలకు తాగేందుకు నీళ్లు లేక అవస్థలు పడుతున్నాయి.

కాలనీ అభివృద్ధికి సహకరించని అధికారులు : మంజూరైన నిధులు కాలనీ నిర్మాణానికి అవసరమైన వసతులు ఏర్పాటు చేయటంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేసారని లబ్దిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మంజూరైన నిధులు అధికారులకే ఎరుక. కొత్తప్రభుత్వం వచ్చి పదిహేడు నెలలు అయినప్పటికీ నేటికీ అసంపూర్తిగా నిలిచివున్న గృహాలపై కనికరం చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఎన్ని సమస్యలు ఉన్న కొత్తవాటికి మోక్షం ఎప్పుడో ఒకవేళ మంజూరైన పాతవాటి అభివృద్ధి ఉందా.. లేదా.. అని లబ్దిదారులు దిగాలు చెందుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మహాసభలను జయప్రదం చేయండి

దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మూడవ మండల మహాసభలు 20వ తేదీ అనగా శనివారం దోర్నాల పట్టణంలోని శ్రీశైలం రోడ్డులో గల శివసదనం ఆవరణలో జరుగుతున్నట్లు రైతు సంఘం డివిజన్ నాయకులు దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి మండలంలోని అన్ని గ్రామాల నుండి రైతులు అధిక సంఖ్యలో పాల్గొని మండల మహాసభలను జయప్రదం చేయాలని వారు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం వెలుగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేసి మొదటి సొరంగం ద్వారా నీరు విడుదల చేయాలని, రైతుల ఆన్లైన్ సమస్యలు ప్రభుత్వ అధికారులు స్పందించి పరిష్కారం చేయాలని, యూరియా రైతులకు అందుబాటులో ఉంచాలని, తదితర సమస్యలపై మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. ఈరోజు దోర్నాల పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది.ఈ సమావేశంలో మహాసభల జయప్రదానికి కార్యకర్తల కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు దగ్గుపాటి సోమయ్య, రైతు సంఘం మార్కాపురం మండల కార్యదర్శి గంగిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, సిఐటియు మండల నాయకులు పానుగంటి పిచ్చయ్యలు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలు నిలిపివేయాలి

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేత

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : నాగులుప్పలపాడు మండలం చదలవాడ రెవిన్యూ పరిధిలోని 383 సర్వేనెంబరులో అక్రమ ఇసుక తవ్వకాలను నిలుపుదల చేయాలని మద్దిపాడు మండలం ఇనమనమెళ్ళూరు గ్రామానికి చెందిన యానాదీ కాలనీ వాసులు, గ్రామస్తులు, పండ్ల తోటల యజమానులు గురువారం నాగులుప్పలపాడు మండలం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. 383 సర్వే నెంబరుకు సంబందించిన సుమారు 150 ఎకరాలకు ప్రభుత్వం పేదలకు పట్టాలు ఇచ్చింది. ఆభూముల్లో జెసిబిల ద్వారా అక్రమంగా ఇసుక తవ్వి సొమ్ముచేసుకొనేందుకు పెద్దలు కన్నుపడింది. ఈ పాటికే మనుషుల ద్వార ఎత్తించి భయటకు తరలిస్తున్నారు. ఇక జెసిబిల ద్వార అయితే 20 అడుగుల మేర లోతులో తవ్వి ఇసుకను తరలిస్తారని దాంతో పెద్ద పెద్ద గుంతలు పడి గుండ్లకమ్మ వరద వచ్చి ఆప్రాంతంలో ఉన్న మామిడి, సపోట, జామ, జామాయిల్ తదితర తోటలు దెబ్బతినే ప్రమాదం ఉందని దాంతో పాటు మద్దిపాడు మండలం యానాది కాలనీలోని ఇండ్లు కొట్టుకు పోయే ప్రమాదం ఉందని కాలనీ వాసులు, గ్రామస్తులు, పండ్లతోటల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చదలవాడ రెవిన్యూ పరిధిలోని భూముల్లో నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామానికి చెందిన షేక్ ఖాజావలి తండ్రి మస్తాన్ వలీ ఎం ఎల్ ఏ చెప్పాడని మీరుఎవరు అడ్డుకోవడానికి అంటూ జె సిబితో అక్రమంగా ఇసుకను తరలించి సొమ్ముచేసుకొనేందుకు పూనుకున్నారని తెలిపారు. ఇప్పటికైన ఇసుక అక్రమ త్రవ్వకాలను నిలుపుదల చేసి మాతోటలతో పాటు కాలనీ కాపాడాలని తహశీల్దార్ ను కోరారు. అనంతరం తదితర అంశాలతో కూడిన వినతి పత్రం తహశీల్దార్ ప్రవీణ్ కుమార్ కు అందచేసారు. తహశీల్దార్ ప్రవీణ్ కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి తగుచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు జె జయంతిబాబు, నాగులుప్పలపాడు, మద్దిపాడు సిపిఎం మండల కార్యదర్శులు టి శ్రీకాంత్ ,ఉబ్బా ఆదిలక్ష్మి , గిరిజన సంఘం నాయకులు మల్లవరపు శ్రీనివాసరావు,దొప్పలపూడి సుబ్బయ్య, శేషయ్య, గ్రామస్తులు, పండ్లతోటల యజమానులు పాల్గొన్నారు.

20న తిరుపతి నాయుడు జయంతి

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే దివంగత నేత ఇరిగినేని తిరుపతినాయుడు జన్మదినాన్ని పురస్కరించుకొని ఈనెల 20న కనిగిరిలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఇరిగినేని వెంకట నరసయ్య తెలియజేశారు. ముందుగా కనిగిరిలోని పామూరు బస్టాండ్ వద్ద ఉదయం 10.30 గంటలకు ఇరిగినేని తిరుపతినాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించే కార్యక్రమం జరుగు తుందన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు అలాగే కొత్తూరులోని బదిరుల పాఠశాలలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ వంటి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ సేవా కార్యక్రమాల్లో నియోజక వర్గంలోని ఇరిగినేని తిరుపతి నాయుడు అభిమానులతో పాటు జిల్లాలో ఉన్న ఇరిగినేని అభిమానులు అభిమాన సంఘాల నాయకులు విరివిగా ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

'పేస్' విద్యార్థులకు బహుమతులు

విశాలాంధ్ర -ఒంగోలు : స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాల ఎం.బి.ఏ విద్యార్థులు కావలి పి బి ఆర్ విశ్వోదయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ వారు నిర్వహించిన విశ్వోవ 2కె 25 సదస్సు నందు ఎం.బి.ఎ. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వి.జ్యోత్స్న, ఎం. అనిల్ కుమార్, జి.సాయి అసితోష్ పాల్గొన్నారు. విద్యార్థులకు ఈ సదస్సు నందు క్విజ్ పోటిల నందు తృతీయ బహుమతి సాధించినారు.ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండింగ్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ఇలాంటి సదస్సు ద్వారా విద్యార్థుల యొక్క నైపుణ్యత పెరుగుతుందని అని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి వి కె మూర్తి మరియు కళాశాల డీన్ స్టూడెంట్ అఫైర్స్ మరియు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ ఆర్ వీరాంజనేయులు, డీన్ అకాడమిక్స్ సి.వి.సుబ్బారావు, కళాశాల ఎ.ఓ. ఎం.వి.రమణ బాబు, ఎం బి ఏ విభాగాధిపతి డాక్టర్ టి.మేరీ జోన్స్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంధి విద్యార్థులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మెరుగైన సేవలు ఎస్బీఐ లక్ష్యం

రీజనల్ మేనేజర్ వెల్లంకి శ్రీనివాసరావు

విశాలాంధ్ర- ఒంగోలు : ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎన్నో వినూత్న పథకాలను అమలు చేస్తోందని ప్రకాశం జిల్లా ఎస్బీఐ రీజనల్ మేనేజర్ వెల్లంకి శ్రీనివాసరావు అన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకాశం జిల్లా రీజనల్ శాఖ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఒంగోలులో టౌన్ హౌల్ మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్ కు ఎస్బీఐ గుంటూరు పరిపాలనా కార్యాలయ చీఫ్ మేనేజర్ సంజీవ్ కుమార్ బన్సల్ ప్రత్యేక అతిధిగా హాజరయ్యారు. ప్రకాశం జిల్లా ఎస్బీఐ రీజనల్ మేనేజర్ వెల్లంకి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ టౌన్ హాల్ మీటింగ్ లో ఆర్.బి.ఓ చీఫ్ మేనేజర్లు కె.రవికుమార్, వేదం రాజేష్ బాబు, కె.హారతి, హెచ్.ఆర్.మేనేజర్ ఎ.ఎన్.వి.ఎస్.నళినీకాంత్, కె.జానకిరామయ్య, అసోసియేషన్ నాయకులు వి.శ్రీనివాసరావు, సీహెచ్. శ్రీనివాసరావు, అవార్డు యూనియన్ నాయకులు వి.ఎస్.ఆర్.సుధాకర్, పి.వెంకటరెడ్డి, పెద్ద సంఖ్యలో ఖాతాదారులు పాల్గొన్నారు.

నృత్య పోటీల్లో రాణించిన శ్రీ గురుదత్త విద్యార్థులు

విశాలాంధ్ర- ఒంగోలు : శ్రీ గురుదత్త హై స్కూల్ 9వ తరగతి విద్యార్థినులు భాను మరియు బృందం జెసిఐ ఒంగోలు వారు నిర్వహించిన అంతర్‌పాఠశాల పాశ్చాత్య నృత్య పోటీలలో 2వ బహుమతి సాధించి తమ ప్రతిభను చాటారు.వారి కృషి, ప్రతిభకు చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్‌చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈఓ నల్లూరి జయప్రకాశ్ నారాయణ్, ప్రిన్సిపాల్ శ్రీమతి జి. శ్రీదేవి, ఉపాధ్యాయ మరియు ఉపాధ్యాయేతర సిబ్బంది హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

శ్రీశైలం రోడ్‌లో కారు బోల్తా

నలుగురికి గాయాలు

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : మండల కేంద్రమైన దోర్నాలలోని శ్రీశైలం రోడ్‌లో ఈద్గా వద్ద కారు పంచరై నేషనల్ హైవే సైడ్ కు దూసుకెళ్లిన కారు బోల్తా పడి నలుగురికి గాయాలు ఆయన సంఘటన మండల కేంద్రమైన దోర్నాలలో జరిగింది. అందిన సమాచారం కొరకు నరసరావుపేట నుండి శ్రీశైలం దైవదర్శనానికి వెళు తుండగా ఒక్కసారిగా కారు పంచర్ అయి హైవే రోడ్డు పక్కన పడిపోయింది. అందులో ప్రయాణిస్తున్న పోతానీ శివరామయ్య, పద్మావతి, రేవతి, రోషినిలకు గాయాలయ్యాయి వీరినీ దోర్నాల ప్రభుత్వ వైద్యశాల కు తీసుకువచ్చి, వైద్య సేవలు నిర్వహించారు.

చక్కెర పదార్థాల వాడకాన్ని తగ్గించాలి

విశాలాంధ్ర-పామూరు : ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణంలో చక్కెర ఉన్న పదార్థాల వాడకాన్ని తగ్గించి ఆరోగ్యంగా ఉండాలని అసిస్టెంట్ సి డి పి ఓ. పి.లావణ్య అన్నారు. గురువారం 8వ రాష్ట్రీయ పోషణ్ మాసం స్థానిక మండల పరిషత్ కార్యాలయము నందు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శిశు, చిన్న పిల్లలు ఎలాంటి ఆహారం తీసుకోవాలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ సిడిపిఓ పి.లావణ్య, డాక్టర్ రవళి ప్రియాంకలు మాట్లాడారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : మండలంలోని చింతల, కొర్రపోలు గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారి స శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం నల్లమల అడవి ప్రాంత గిరిజన గూడాలలో వైద్య శిబిరాలు నిర్వహించారు. చింతల ఆరోగ్య కేంద్ర పరిధిలో వైద్యాధికారులు డాక్టర్ యాగ్నిక్ ఆధ్వర్యంలో గైనకాలజిస్ట్ డాక్టర్ ఖాదరయ్య, దంత వైద్యురాలు కుసుమ, డాక్టర్ దివ్యశ్రీ చింతల పరిధిలోని గూడాలలో ఆశ్రమ పాఠశాల యందు చింతల వైద్యాధికారి డాక్టర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అలాగే కొర్ర పోలు నందు దోర్నాల సూపరిటెంట్ నాగమహేశ్వరి, వైద్య పరీక్షలు నిర్వహించారు. చింతల వైద్య శిబిరంలోమహిళలు గర్భిణీలు, చిన్న బిడ్డ తల్లులకు, బిపి, షుగర్ క్యాన్సర్, అసంక్రమిత వ్యాధులు జ్వరాలతో బాధపడే వారికి, పోషక లోపం శరీరంతో బాధపడే 310కి మందికి రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అలాగే విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. చెంచు గిరిజనులకు రక్తహీనత గురించి వివరించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

విశాలాంధ్ర-పీసీపల్లి : నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని డిప్యూటీ ఎంపీడీవో డిటి వేణుగోపాల్ రెడ్డి ధర్మ తేజలు అన్నారు. గురువారం మండలంలోని మండల సమాఖ్య వెలుగు కార్యాలయంలో రెండవ విడత ఉల్లాస్ అక్షర ఆంధ్ర శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళా సంఘాల్లో ఉన్న నిరక్షరాస్యులైన వయోజన మహిళలను అక్షరాస్యులుగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేకంగా ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ అన్ ఇన్ సొసైటీ) పథకాన్ని అమలులోకి తెచ్చిందని దేశంలో ఉన్న ప్రతీ మహిళా అక్షర జ్ఞానం కలిగి ఉండాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్యా సూపర్వైజర్లు వెంకటేశ్వర రెడ్డి చౌడిరెడ్డి సీసీలు గీత శశిరేఖ ఎంఎలు భ్రమరాంబ పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ సరికాదు

మాజీ ఎమ్మెల్యే కె.పి నాగార్జున రెడ్డి

విశాలాంధ్ర - గిద్దలూరు : మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణతో నడపడం సరైన విధానం కాదని గిద్దలూరు వైఎస్ఆర్సిపి ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కె.పి నాగార్జున రెడ్డి అన్నారు. గురువారం విద్యార్థి యువజన నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కె. పి.నాగార్జున రెడ్డి మాట్లాడుతూ 19వ తేదీన మార్కాపురంలో ప్రయివేటు పరం చేయనున్న మెడికల్ కాలేజీని సందర్శించి నిరసన వ్యక్తం చేయనున్నట్టు తెలిపారు. ఆ నిరసనకు పెద్ద ఎత్తున విద్యార్థులు, విద్యార్థి సంఘాల నేతలు, యువజన విభాగం నాయకులు తరలి రావాలన్నారు. జగనన్న ప్రభుత్వంలో నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రారంభిస్తే ఆయనకు మంచిపేరు వస్తుందన్న అక్కసుతో ఒకటిన్నర సంవత్సరంగా పేద విద్యార్థులకు ఆ మెడికల్ కాలేజీలను అందుబాటులోకి తీసుకురాకుండా కాలయాపన చేశారని విమర్శించారు. ఏడాదిన్నర కాలంగా ఆ కాలేజీలను ప్రారంభించకపోవడం వల్ల ఎంతో మంది పేద విద్యార్థులు మెడికల్ సీట్లు కోల్పోయారని, వైద్య విద్యను పేదలకు దూరం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమా..? అంటూ ప్రశ్నించారు. జగనన్న చేసిన మంచిని కూటమి ప్రభుత్వం ఎంతో కాలం కప్పి పుచ్చలేరని, ఆ ప్రభుత్వంలో కట్టించిన కాలేజీలను వెలుగులోకి తీసుకురావడానికి వైఎస్ఆర్సీపీ యువజన, విద్యార్థి విభాగం మెడికల్ కాలేజీల సందర్శనకు శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగానే మార్కాపురం మెడికల్ కాలేజీని జిల్లా నలుమూలల నుంచి వైఎస్ఆర్సీపీ నేతలు, కార్యకర్తలు వెళ్లి సందర్శించడం, అక్కడే వైద్య విద్యార్థులకు కూటమి ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని బహిర్గతం చేయనున్నట్లు కె. పి. నాగార్జున రెడ్డి గారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు సూర స్వామి రంగారెడ్డి మాజీ ఎంపీపీ కడప వంశీధర్ రెడ్డి గిద్దలూరు వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు రామ్ రెడ్డి యువజన సంఘ నాయకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర epaper.visalaandhra.com శుక్రవారం 19 । సెప్టెంబరు । 2025

క్రీడలతో శారీరక దృఢత్వం

విశాలాంధ్ర-దొనకొండ: క్రీడలతో శారీర దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంఈఓ ఎన్.సాంబశివరావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వివి రామాంజనేయులు ఆధ్వర్యంలో జరుగుతున్న మండల స్థాయి క్రీడా పోటీలను ఎంఈఓ గురువారం ప్రారంభించారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని, ఉజ్వల భవిష్యత్తుకు క్రీడలు సైతం దోహద పడతాయన్నారు. మండలంలోని 8 పాఠశాలల నుండి సుమారు 200 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా మొదటి రోజు అథ్లెటిక్స్ నిర్వహించినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు బొరిగొర్ల మురళీ తెలిపారు. మండల స్థాయిలో సత్తా చాటిన వారిని డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు మురళీ తెలిపారు. ఈ పోటీల నిర్వహణతో పాఠశాల ప్రాంగణంలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది.

వాటర్ ప్లాంట్స్ పనిచేయక విద్యార్థుల ఇబ్బందులు

విశాలాంధ్ర - తాళ్లూరు: మండలంలో నాడు -నేడు పథకంలో గత ప్రభుత్వ హయాంలో అనేక పాఠశాలను సుందరంగా తీర్చిదిద్ది , విద్యార్థులకు మంచి నీటి సౌకర్యం నిమిత్తం వాటర్ ప్లాంట్స్‌ను సైతం ఏర్పాటు చేసారు. అయితే నాడు ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్స్‌లో ఏవైనా లోపాలు వస్తే నాడు - నేడు యాప్‌లో నమోదు చేస్తే సంబంధిత సిబ్బంది వచ్చి మరమ్మత్తులు చేసి వెళ్లే వారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత అటువంటి వ్యవస్థ ఏదీ లేక పోవటంతో మండలంలోని పలు చోట్ల వాటర్ ప్లాంట్స్ మూలన పడ్డాయి. బొద్దికూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ సక్రమంగా పనిచేసిన దాఖలాలు లేవు. అయితే బొద్దికూరపాడు ప్రాథమిక పాఠశాల (ఎస్సీ వీఆర్)లో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ మాత్రం గత నాలుగేళ్లుగా బాగా పనిచేసినది. అయితే గత రెండు రోజుల క్రితం మరమ్మత్తులకు గురయినది. కావున ప్రభుత్వ ప్రాథమిక , హైస్కూల్స్‌లో రూ. లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్స్‌ను తిరిగి ఉపయోగంలోనికి తీసుకువచ్చేలా ఉన్నతాధికారులు, కూటమి నాయకులు దృష్టి సారించాలని ఏపీటీఎఫ్ తాళ్లూరు మండల గౌరవ అధ్యక్షులు సంగు రవీంద్రా రెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు గుంఠూరి నాగ రాజు, నారి పెద్ది శ్రీనివాస రావు, జిల్లా కౌన్సిల్ పోలం రెడ్డి సుబ్బా రెడ్డిలు ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్‌ఫెడరేషన్ తాళ్లూరు మండల శాఖ కోరుతున్నారు.

అందుబాటులో ఎరువులు

విశాలాంధ్ర -చీమకుర్తి : సహకార సంఘం చైర్మన్ పూనాటి వెంకట్రావు శుక్రవారం నుండి సహకార సంఘంలో ఎరువులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. 19 925 నుండి యూరియా, డిఏపి,సొసైటీలో అందుబాటులో ఉంటాయని మండల పరిధిలోని రైతులు తమ ఆధార్ కార్డు పొలం పాస్ బుక్, జిరాక్స్ కాపీ వెంట తీసుకొచ్చి అవసరమైన ఎరువులను తీసుకుని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పంట రుణాలు గరిష్టంగా 3 లక్షల రూపాయల నుండి గరిష్టంగా ఏడు లక్షల వరకు కర్షక మిత్రా రుణాలు 15 లక్షల వరకు మంజూరు చేస్తామని తెలిపారు.

హైదర్ క్లబ్ భూ కబ్జాపై డీఆర్ఓ విచారణ

విశాలాంధ్ర- ఒంగోలు : ఒంగోలు పట్టణములోని హైదర్ క్లబ్ వారు రూ.100 కోట్ల విలువైన వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ స్థలము కబ్జా చేసిన విషయంలో డిఆర్ఓ గురువారం విచారణ చేపట్టారు. పట్టణ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన గ్రీవెన్ సెల్ నందు జిల్లా కలెక్టరుకి ఇచ్చిన అర్జీ మేరకు జిల్లా రెవిన్యూ అధికారి ఓబులేసు గురువారంన విచారణకు మండల రెవిన్యూ అధికారి, పురపాలక సంఘం సిటీ ప్లానింగ్ అధికారి మరియు ప్రజా సంఘాల వారిని పిలిచారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి వారు హైదరి క్లబ్ వారికి నోటీసు ఇచ్చి సదరు కాపీని ప్రజా సంఘాలకు ఇచ్చి వారి సమక్షం లో సర్వే చేసి పూర్తిస్థాయి విచారణ నివేదికను ఒక వారం రోజులలో ఇవ్వవలసినదిగా ఆదేశించారు. సమావేశంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకరరావు ఈ విషయంలో ప్రభుత్వ అధికారులు స్థలం కబ్జా జరుగుతున్న ఉద్దేశ్యపూర్వకంగా ఉదాసీనంగా ఉండి అక్రమ నిర్మాణం కమర్షియల్ కాంప్లెక్స్ శంకుస్థాపనకు హాజరైనారని, కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి అయ్యేవరకు చూస్తూ ఉన్నారని ఆరోపించారు. కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ కలెక్టరు పి. పేరయ్య, అఖిల భారతీయ బహు జన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరణికోట లక్ష్మీనారాయణ,ఇండిపెండెంట్ లేబర్ పార్టీ దాసరి సుందరం, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా నాయకులు యం.జార్జి, ఆదివాసి హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పేరం సత్యం,రైతుకూలీ సంఘం జిల్లా నాయకుడు కొంగర నరసింహం, బిసి సమన్వయ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మస్తాన్, ఓ.పి.డి. ఆర్ జిల్లా కార్యదర్శి అర్జా లక్ష్మీ ప్రసాదరావు హాజరైనారు.

విద్యార్థులకు డైరీలు పంపిణీ

విశాలాంధ్ర-కంభం : స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పులి శ్రీనివాస్ ప్రసాద్ హజరత్ గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఉచితంగా డైరీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పులి శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు దైనందిన కార్యక్రమాల వివరాలను పొందుపరిచేందుకు వీలుగా ఉంటుందని ఈ డైరీ లను పాఠశాల విద్యార్థులకు అందజేశారు. గురువారం మధ్యాహ్నం పాఠశాల యందు జరిగిన కార్యక్రమంలోకంభం మండల విద్యాశాఖ అధికారి 2 శ్రీనివాసరావు, బేస్తవారిపేట మండల విద్యాశాఖ అధికారులు మధుసూదన్ రెడ్డి, రమణారెడ్డి, రాచర్ల మండల విద్యాశాఖ అధికారి మొయినుద్దీన్, హెచ్ గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, షబ్బీర్ ఈ డైరీలను విద్యార్థులకు పంపిణీ చేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం :

ఈ పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను, బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బందిని దృశ్శాలువాల తో ఘనంగా సన్మానం చేసారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

విశాలాంధ్ర-పామూరు రూరల్ : చదువుతోపాటు క్రీడలలో కూడా విద్యార్థినీ విద్యార్థులు రాణించాలని మండల టిడిపి అధ్యక్షులు బొల్లా నరసింహారావు, ఏఎంసీ చైర్మన్ యారవ రమా శ్రీనివాస్, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డిలు అన్నారు. గురువారం మండలములోని వగ్గంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శారీరిక దారుఢ్యం, మానసిక ఉల్లాసం, విద్యార్థులలో ఐక్యత కు క్రీడలు దోహదపడతాయన్నారు. క్రీడలలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషన్లు ఉంటాయన్నారు. చిన్ననాటి నుండే క్రీడలు పట్ల ఆసక్తి చూపాలని, తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ జి కరుణ కుమారి, పిఏసిఎస్ చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు, ఏఎంసి వైస్ చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, ఉప్పలపాటి హరిబాబు, ఇర్రి కోటిరెడ్డి, రెక్కల రమణారెడ్డి, కొండిచెట్టి వెంకటరమణయ్య, పామూరు పట్టణ టిడిపి అధ్యక్షులు సయ్యద్ అమీర్ బాబు, చావ సుబ్బారావు పాల్గొన్నారు.

సరికొత్త టెక్నాలజీలపై వర్క్ షాప్

విశాలాంధ్ర- ఒంగోలు : స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో సరికొత్త టెక్నాలజీలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వివిధ వర్క్ షాప్స్ నిర్వహించారు. సీఎస్ ఈ, ఏఐఎమ్ ఎల్ విద్యార్థులకు ఈ వర్క్ షాప్స్ ఏర్పాటు చేశారు. మెషిన్ లెర్నింగ్ ద్వారా యాప్‌ని ఎలా డెవలప్ చేయాలి అనే అంశంపై ఏఐఎమ్ ఎల్ విద్యార్థులకు శిక్షణ అందించారు. ఇండస్ట్రీ ఎక్స్ పర్ట్ అయినటువంటి ప్రియాన్షు శుక్లా దీనిపై ప్రత్యేక ప్రజంటేషన్ ఇచ్చి విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. సీఎస్ఈ రెండో ఏడాది విద్యార్థులకు వర్క్ షాప్ నిర్వహించారు. సాఫ్ట్ వేర్ డెవలపర్, ట్రైనర్ సుందర్. సి విద్యార్థులకు ఓ పి పి ఫ్యాషన్ ఇన్ యాక్షన్, సింగిళ్టన్ అనే అంశాలపై అవగాహన కల్పించారు. సరికొత్త టెక్నాలజీపై విద్యార్థులకు ఎప్పటికప్పుడు శిక్షణ అందించడంలో క్విస్ కళాశాల ఎప్పుడూ ముందు ఉంటుందని, విద్యార్థులకు ఉపయోగపడే ఇలాంటి అనేక కార్యక్రమాలు నిత్యం నిర్వహిస్తూ ఉంటామని విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి గాయత్రి తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ ప్రవీణ, శివప్రసాద్, విజయలక్ష్మీ, డాక్టర్ రాయుడు తదితరులు పర్యవేక్షించారు.

మహిళా శక్తికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం

విశాలాంధ్ర - తాళ్లూరు: తల్లి ఆరోగ్యంగా ఉంటే సమాజం సురక్షితంగా ఉంటుందని ప్రభుత్వం భావించి స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎంపీపీ తాటికొండ శ్రీనివాస రావు అన్నారు. తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి టి ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాస రావు, జెడ్పీటీసీ మారం వెంకట రెడ్డి, వైస్ ఎంపీపీ ఇడమకంటి వెంకటేశ్వర రెడ్డి , సర్పంచి మేకల చార్లెస్ సర్జన్ ముఖ్య అతిథిలుగా పాల్గొని ప్రసంగించారు. మహిళలు సౌఖ్యంగా ఆరోగ్యంగా ఉంటే ఆ నివాసం చక్కగా ఉంటుందని ముందుగా మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలనే ఆలోచనలకు వక్తలు ధన్యవాదాలు చెప్పారు. వైద్యాధికారి ప్రవీణ్ కుమార్, వైద్యులు రాజేష్ , హోమియో వైద్యురాలు శిరీష, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిరలు మాట్లాడుతూ ప్రతి మహిళా తమ ఆరోగ్యాన్ని లెక్కచేయక ఇంటి కోసం తమ పిల్లల కోసం ఎంతో శ్రమిస్తారని, ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరంలో తమ ఆరోగ్యాన్ని పరిక్షించుకుని తగిన వైద్యం పొంది మరింత మెరుగైన ఆరోగ్యాన్ని పొందాలని కోరారు. పలు విభాగాలుగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం ప్రదర్శను నిర్వహించారు. అనస్థిషియా వైద్యులు డాక్టర్ షయామ్, సీహెచ్ఓ ఏవీ రమణమ్మ, హెల్త్ సూపర్ వైజర్ రవి కుమార్ పీహెచ్ఎన్ వై విజయమ్మ,హెచ్‌వీ మాలతి, ఆఫ్తాలమిస్ట్ ఉమా, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, అంగన్ వాడీ టీచర్లు, కస్తూరిబా విద్యార్థులు పాల్గొన్నారు.

తూర్పుగంగవరంలో...

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్త నారీ సశక్తి పరివార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ సానికొమ్ము సత్యం, సొసైటీ చైర్మన్ వల్లభనేని సుబ్బయ్య ముఖ్య అతిథిలుగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. చీమకుర్తి సీహెచ్‌సీ సూపరిండెంట్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి , గైనకాలజిస్ట్ శ్వేత అతిథి డాక్టర్లుగా పాల్గొని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మౌనిక , డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి లతో కలిసి 358 మందిని పరీక్షించి అవసరమైన ముందులు అందించారు. సొసైటీ చైర్మన్ వల్లభనేని సుబ్బయ్య 20 గర్భిణీ స్త్రీలకు పండ్లు దాతృత్వంతో అందించారు. డిప్యూటీ ఎంపీడీఓ మల్లేశ్వరి, హెచ్ఈఓ చంద్ర శేఖర్ బాబు, రామిరెడ్డి, శ్రీను, షేక్ మీరా మోహిద్దీన్, సుబ్బా రావు, ఎస్ పుల్లా రెడ్డి పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

వైసీపీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున

విశాలాంధ్ర - పర్చూరు : రైతు సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని వైసీపీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున తెలిపారు. రైతు సమస్యలపై వైసీపీ నిర్వహించిన రైతు పోరు బాట ర్యాలీలో పర్చూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త గాదె మధుసూదన్ రెడ్డితో కలిసి స్థానిక వైసీపీ కేంద్ర కార్యాలయం నుండి బొమ్మల సెంటర్‌కు చేరుకొని వైయస్సార్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రైతుల పోరు బాట ర్యాలీ చేపట్టామని, కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు సకాలంలో యూరియా అందించాలని, రైతు పండించిన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతుల వద్ద ఉన్న పొగాకును పూర్తిగా కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన రైతులకు సకాలంలో నగదు చెల్లింపులు చేయాలని వారు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం రైతులను దగా చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు భవనం శ్రీనివాసరెడ్డి, కోట శ్రీనివాసరావు, యద్దనపూడి హరిప్రసాద్ ,ముప్పాళ్ళ రాఘవయ్య ,కూరాకుల ఇస్సాకు ,గుజ్జర్లపూడి చిన్న, జంగా అనిల్, కటారి అప్పారావు, నియోజకవర్గంలోని అనుబంధ సంఘాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పావనికి అభినందనలు

విశాలాంధ్ర - చెరుకుపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాలలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో 21 ర్యాంకు సాధించిన చందవోలు పావనికి స్థానిక ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. గురువారం గుళ్లపల్లి మండల ప్రజా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మొహమ్మద్ నిస్సార్ అహ్మద్ అధ్యక్షతన అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఇంకొల్లు రంగారావు విశిష్ట అతిథిగా హాజరయ్యారు. వారి చేతుల మీదుగా పావని ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది మరియు పడమట వెంకటేశ్వర్‌రావు, ఎరగళ్ల నాంచారయ్య, మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొని అభినందించారు. పావని సాధించిన విజయం విద్యార్థులకు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని వక్తలు కొనియాడారు.

బేటీ బచావో..బేటీ పడావోపై అవగాహన

విశాలాంధ్ర - సంతమాగులూరు : మండల కార్యాలయాల సముదాయంలోని వెలుగు కార్యాలయంలో ఏపీఎం హనుమంతరావు అధ్యక్షతన బేటీ బచావో.. బేటీ పడావో పై వీఓలకు గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సంతమాగులూరు ప్రాజెక్టు సీడీపీఓ డి.సుధా అతిథిగా విచ్చేసి మాట్లాడారు. గర్భంలో ఉన్న శిశువుపై లింగ నిర్ధారణ చేసినట్లు తెలిస్తే, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు ఎలా తీసుకోవాలో వివరించారు. అలాగే సుకన్య సమృద్ధి యోజన పథకం, బాలిక విద్య ప్రాముఖ్యత పోషకు సంబంధించిన అంశాల గురించి తెలిపారు. అనంతరం బాల్యవివాహ నిరోధక చట్టం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెలుగు జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు నాగబోతు సుజాత, అంగన్వాడీ సూపర్ వైజర్లు ఎం.సుప్రరాణి, జి.ప్రమీల, బ్లాక్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి. ఉమా పాల్గొన్నారు.

విద్యుత్ ఉత్పత్తి, పంపిణీపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - చెరుకుపల్లి : విద్యార్థులు చిన్ననాటి నుండే సాంకేతిక రంగాలపై అవగాహన కలిగి ఉండాలని గుళ్ల పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వృత్తి ఉపాధ్యాయులు కేవీ రామారావు అన్నారు. గురువారం పాఠశాలలోని విద్యార్థులను చెరుకుపల్లి 33/11సబ్ స్టేషన్ పరిశీలనకు తరలించారు. అక్కడ విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ ప్రక్రియలను సమగ్రంగా అధ్యయనం చేసి ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా సబ్ స్టేషన్ సాంకేతిక నిపుణులు విద్యార్థులకు ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు, విద్యుత్ పంపిణీ విధానం, సేఫ్టీ ప్రమాణాలు, మరియు ఆధునిక విద్యుత్ వ్యవస్థలలో వినియోగిస్తున్న పరికరాల గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు లేవనెత్తిన పలు అంశాలకు సంబంధించి వారు విపులంగా విశదీకరించారు. ఈ పరిశీలన ద్వారా విద్యార్థుల్లో విద్యుత్ రంగంపై ఆసక్తి పెరగడమే కాకుండా భవిష్యత్తుకు ఉపయుక్తమయ్యే సాంకేతిక జ్ఞానాన్ని పొందారని ఉపాధ్యాయులు అన్నారు. విద్యార్థులకు ఇలాంటి అవకాశాలు తమలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని ప్రయోగాత్మక అనుభవం ద్వారా భవిష్యత్తులో చదువులు మరింత రాణిస్తారు అన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సబ్ స్టేషన్ సందర్శనకు స్థానిక డిప్యూటీ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్ సురేష్ బాబు అందించిన సహకారానికి ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోనేటి కవిత ఆయనను ఘనంగా సన్మానించారు .ఈ కార్యక్రమంలో ఫుడ్ ప్రాసెసింగ్ ఉపాధ్యాయులు బి ధ్యానచంద్ర, బ్యూటీ మరియు వెల్నెస్ ఉపాధ్యాయురాలు విద్య, పిటిఐకే శివాంజనేయులు విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించారు.

ప్రభుత్వ సర్వేలు సకాలంలో పూర్తి చేయాలి

విశాలాంధ్ర - పర్చూరు : మండలంలోని సచివాలయాల సిబ్బంది ప్రభుత్వం చేపడుతున్న సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని ఇన్చార్జి ఎంపీడీవో వెంకటస్వామి ఆదేశించారు. గురువారం మండలంలోని అడుసుమల్లి, గొల్లపూడి గ్రామ సచివాలయాలను ఇన్చార్జ్ ఎంపీడీవో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. సచివాలయం సిబ్బంది సమయపాలన పాటించాలని ప్రతిరోజు హాజరు పూర్తి చేయాలని చెప్పారు. అలాగే ప్రభుత్వ సర్వేలు సకాలంలో పూర్తి చేయాలని లేని పక్షంలో ఆయా సచివాల సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు చేపడతామని చెప్పారు. గ్రామాల్లో పరిశుభ్ర కార్యక్రమాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు . గొల్లపూడిలో నిర్వహించిన నారీ స్వస్థ హెల్త్ క్యాంపు కార్యక్రమాన్ని సందర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కొననా సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చీరాల ఏరియా ఆసుపత్రిలో 'స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్

విశాలాంధ్ర - చీరాల : మహిళా ఆరోగ్యాన్ని కాపాడుతూ బలమైన కుటుంబాలను నిర్మించాలనే లక్ష్యంతో 'స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమాన్ని గురువారం చీరాల ఏరియా ఆసుపత్రిలో చీరాల నియోజకవర్గ యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్ , చీరాల మున్సిపల్ చైర్మన్ మించాలా సాంబశివరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా యువనేత గౌరీ అమర్నాథ్ మాట్లాడుతూ మహిళ ఆరోగ్యం అంటే జాతీయ ఆరోగ్యం అని ఆరోగ్యవంతమైన మహిళలు శక్తివంతమైన కుటుంబానికి నిలయమవుతుందని, మహిళలు ఎప్పటికప్పుడు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం అత్యంత అవసరమన్నారు.ముఖ్యంగా క్యాన్సర్ వ్యాధి తొలి దశలోనే గుర్తిస్తే మందులతో చికిత్స చేయడం సాధ్యపడుతుందని,కాబట్టి మహిళలు భయపడకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి అని పిలుపునిచ్చారు. అనంతరం ఆసుపత్రి వార్డులు, ఓపి విభాగాన్ని పరిశీలించి, రోగులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, టీడీపీ , జనసేన, బీజేపీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కామేపల్లిలో జనసైనికుల సేవాదృక్పథం

విశాలాంధ్ర - సంతమాగులూరు : కామేపల్లిలో జనసైనికులు సేవా దృక్పథం చాటారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామంలోని వీధుల్లో ఎబెట్ ద్రావణాన్ని ఫాగింగ్ చేశారు. ద్విచక్ర వాహనంపై ఫాగింగ్ యంత్ర పరికరాన్ని ఏర్పాటు చేసి, దోమలకు ఆవాసంగా మారిన మురుగునీటి కాలువలు, ఇంటి పరిసరాల్లో పిచికారీ చేశారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు జనసైనికులు షేక్. మీరావలి, ఎన్. వెంకట రామయ్య, ఎ.కరుణాకర్ తమ సొంత నిధులు వెచ్చించి ముందుకు రావడం అభినందనీయమని ప్రజలు కొనియాడారు.

పేదలకు ఆర్థిక భరోసా సీఎంఆర్ఎఫ్

విశాలాంధ్ర - యద్దనపూడి : పేదలకు ఆర్థిక భరోసా సీఎంఆర్ఎఫ్ అని టీడీపీ నాయకులు కనపర్తి నాగేశ్వరరావు అన్నారు. యద్దనపూడి టీడీపీ కార్యాలయం వద్ద ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలన అద్భుతంగా ఉందని,వివిధ కారణాలతో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన పలువురికి పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సిఫార్సు మేరకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్దిదారులకు ఎమ్మెల్యే ఆదేశాల మేరకు యద్దనపూడి గ్రామానికి చెందిన శృంగవరపు రాధకిష్టకి 1,41,000 అందచేసిన అందజేశారు. ఈ కార్యక్రమంలో సూరిశెట్టి శ్రీనివాసరావు, షేక్ బాజీ,కొండలరాయుడు, సతీష్,రావూరి రాధా,అత్తోటి శ్రీను, గొట్టిపాటి వేణు, ముద్దన శ్రీను పోతా నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

డిఎస్సీలో ఉద్యోగం సాధించిన షేక్ సుమలత

విశాలాంధ్ర - యద్దనపూడి : యద్దనపూడి గురుకుల పాఠశాలలో పీజీటీ ఇంగ్లీష్‌గా పని చేస్తున్న జొన్నతాళి గ్రామానికి చెందిన షేక్ సుమలత ఏపీటీడబ్ల్యు ఆర్ఎస్‌లోటీలో టీజీటీ ఇంగ్లీష్‌లో ఉద్యోగం సాధించారు. ఆమె 17 సంవత్సరాలు నుంచి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కాంట్రాక్ట్ ఇంగ్లీష్ ఉపాధ్యాయ రాలిగా పని చేస్తూ ఉద్యోగం సాధించటం విశేషం. డిఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందించనున్న కూటమి ప్రభుత్వానికి సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖామంత్రి లోకేష్ సుమలత కృతజ్ఞతలు తెలిపారు. సుమలతను పలువురు అభినందించారు.

25 నుంచి వృద్ధులకు రేషన్ అందించాలి

విశాలాంధ్ర - చెరుకుపల్లి : వృద్ధులకు, వికలాంగులకు ప్రతి నెల 25 నుండి 30వ తేదీలోగా ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందించాలని తహసీల్దార్ సీహెచ్ పద్మావతి అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో మండల రేషన్ డీలర్స్ తో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్ డీలర్లు నిర్దేశించిన సమయానికి దుకాణాలు తెరచి ఉంచాలని, ప్రభుత్వం అందించే ప్రతి రేషన్ సరుకును ప్రజలకు అందించాలని ఆమె అన్నారు. స్మార్ట్ కార్డుల ద్వారా రేషన్ ఎలా పొందాలో వినియోగదారులకు వివరించాలన్నారు. ప్రజల నుండి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవలసిన బాధ్యత రేషన్ దుకాణదారులపై ఉందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారి ఓంకార్, జిల్లా రేషన్ డీలర్ల కార్యదర్శి రవిచంద్ర రెడ్డి, మండల్ రేషన్ డీలర్ల సంఘం నాగుల పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

కారంచేడులో స్వామిత్వ సర్వే ప్రారంభం

విశాలాంధ్ర - కారంచేడు : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వామిత్వా సర్వే కార్యక్రమాన్ని కారంచేడు గ్రామంలో సచివాలయ సిబ్బంది గురువారం నిర్వహించారు. పంచాయితీ సెక్రటరీ రమేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ సర్వేలో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి భూసంబంధిత వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా పంచాయతీ సెక్రటరీ రమేష్ బాబు మాట్లాడుతూ, "స్వామిత్వా సర్వే ద్వారా ప్రతి స్థిరాస్తికి ఒక ప్రత్యేక నెంబర్ కేటాయించబడుతుందని,దీంతోఆస్తి వివరాలు గూగుల్ మ్యాప్‌లో స్పష్టంగా కనిపిస్తాయన్నారు. ఎవరి పేరుతో ఆస్తి ఉందో, సరిగా రిజిస్ట్రేషన్ అయిందో క్షణాల్లో తెలుసుకునే సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్ సలీమతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో 'స్వస్త్ నారి'

విశాలాంధ్ర - కారంచేడు : కారంచేడు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో శుక్రవారం 'స్వస్త్ నారి' ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సిహెచ్ఓ) శాంతి ప్రియ, ఏఎన్ఎం జోష్న, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్సిడిసిడి 4.0 లో భాగంగా క్యాన్సర్ అవగాహన గురించి వివరిస్తూ, ఎలాంటి లక్షణాలు గమనించిన వెంటనే వైద్యులను సంప్రదించాలనే విషయాన్ని ప్రజలకు తెలియజేశారు. అలాగే కార్యక్రమంలో హెచ్‌బి, ఆర్‌బి, ఎస్‌బిపి వంటి రక్తపరీక్షలు నిర్వహించారు.గర్భిణీ స్త్రీలు తీసుకోవలసిన పోషకాహారం, శ్రద్ధ వహించాల్సిన జాగ్రత్తలు, మానసిక ఆరోగ్యం విషయంలో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని డాక్టర్లకు తెలియజేయాలని సూచించారు.ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమం గ్రామీణ మహిళలకు ఆరోగ్య సదుపాయాలపై అవగాహన కల్పించడమే కాకుండా, వారికి అవసరమైన వైద్య సహాయం అందించే దిశలో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

గ్యాస్ వినియోగదారులు..ఈకేవైసీ తప్పనిసరి

విశాలాంధ్ర - కారంచేడు : కారంచేడు భారత్ గ్యాస్ వినియోగ దారులు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తప్పనిసరిగా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని శాఖ మేనేజర్ నాతాని శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఈకేవైసీ పూర్తి చేయని వినియోగదారులకు ప్రభుత్వం అందించే సబ్సిడీలు, పథకాల రాయితీలు నిలిచిపోవచ్చని ఆయన హెచ్చరించారు.

30 పోలీస్ యాక్ట్ అమలు

విశాలాంధ్ర-మార్కాపురం: మార్కాపురం సబ్ డివిజన్ లో సెక్షన్ 30 అమలులో ఉందని డిఎస్పి డాక్టర్ యు. నాగరాజు అన్నారు. గురువారం రాత్రి ఆయన విశాలాంధ్ర తో మాట్లాడుతూ సెక్షన్ 30 అమలులో ఉండడం వలన పోలీసు శాఖ నుండి వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలకు సంబంధించి ర్యాలీ, ప్రదర్శనలకు అనుమతి లేదని అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం చేయడాన్ని నిరసిస్తూ వైసిపి రేపు కళాశాలను సందర్శించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్న నేపధ్యంలో డిఎస్పీ పై విధంగా స్పందించారు. వైసిపి ముఖ్య నాయకులకు ఎలాంటి ఆందోళన కార్యక్రమంలో పాల్గొన వద్దని తెలియజేస్తూ నోటీసులు కూడా తమ శాఖ నుండి అందజేయడం జరుగుతుందని ఆయన అన్నారు.శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా చట్టాన్ని ఉల్లంఘిస్తే అటువంటి వారిపై పోలీసు శాఖ తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిఎస్పీ హెచ్చరించారు.

పాత పద్ధతిలోనే దసరా సెలవులు కొనసాగించాలి

ఎస్టీయూ నాయకులు డిమాండ్

విశాలాంధ్ర - కొల్లూరు : పాఠశాలకు దసరా సెలవులను పాత పద్ధతిలోనే కొనసాగించాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కొల్లూరు మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఉపాధ్యాయులచే ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని ఉపాధ్యాయుల నుండి క్షేత్రస్థాయిలోని వారి ఇబ్బందులను సమస్యలను తెలుసుకోవడం జరిగింది. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ రామచంద్రయ్య మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు నాలుగు విడతల పెండింగ్ ఉన్నాయని వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పీఆర్సీ కాల పరిమితి పూర్తై రెండు సంవత్సరాల అయినప్పటికీ పీఆర్సీ కమిషన్ నియమించకపోవడం బాధాకమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిషన్ నియమించి మధ్యంతర భృతి మంజూరు చేయాలని కోరారు. ఎప్పటినుండో ఆనవాయితీగా వస్తున్న పాఠశాలకు దసరా సెలవులను దసరా నవరాత్రులు ప్రారంభమైన నాటి నుండి కాకుండా తదుపరి రెండు రోజుల తర్వాత ఈ సంవత్సరం సెలవులు ప్రకటించటం జరిగిందని, పాత పద్ధతిలోనే 22వ తేదీ నుండి పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఏరియా కార్యదర్శి డివి సుబ్బారావు మాట్లాడుతూ, చాలా పాఠశాలలకు కాంపోజిట్ గ్రాంట్ జమ కాలేదని వాటిని వెంటనే మంజూరు చేయాలని, ఈ సంవత్సరం నూతనంగా పాఠశాలలకు అందించిన పరీక్షల అసెస్మెంట్ బుక్స్ పై రివ్యూ చేసి మార్పులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజేంద్రకుమార్, నాగరాజు మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఎస్టీయూ ఎప్పుడూ ముందుంటుందన్నారు. సీనియర్ నాయకులు బాలాజీ, బి. శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలతో వ్యవసాయానికి కొత్త రూపు

విశాలాంధ్ర - చెరుకుపల్లి : వ్యవసాయంలో మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన ఆవిష్కరణలతో లాభసాటిగా చేయవచ్చునని ఏ ఆర్ సి సైంటిస్ట్ సివి రామరావు అన్నారు. గురువారం గూడవల్లి గ్రామంలో ఆత్మా వారి సౌజన్యంతో వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు రైతులతో చర్చా గోష్ఠి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వరిలో ఆశించే వివిధ రకాల పురుగులు, తెగుళ్లను నివారించడానికి తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ బాపట్ల నుండి విచ్చేసిన వాసుదేవరావు మాట్లాడుతూ వరి మరియు అపరాలలో పంట కోత అనంతరం వచ్చే సాంకేతిక వివరాలు మరియు రైతు స్థాయిలోనే ప్రాసెసింగ్ చేసుకునే విధానాల ద్వారా అధిక లాభాలు ఎలా పొందాలో వివరించారు. తక్కువ ఖర్చుతో రైస్ మిల్లు, దాల్ మిల్లు నిర్వహణ గురించి వారికి తెలియజేశారు. ఉత్సాహవంతులైన రైతుల ఎవరైనా బాపట్లలోని పోస్ట్ ఆఫీస్ టెక్నాలజీ గురించి తెలుసుకోవాలంటే దానిని సందర్శించి అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు. మరో సైంటిస్టు కామాక్షి మాట్లాడుతూ నల్లి నివారణ ముఖ్యమని దానికి ప్రొఫై నా ఫస్ 400 ఎంఎల్ ఎకరానికి వాడుకోవాలన్నారు. బ్యాక్టీరియా ఎండు తెగులు వర్షాలు పడుతున్నప్పుడు నత్రజని వాడకాన్ని ఆపాలన్నారు. పొటాషియం ఎరువు వేయటం వల్ల రోగనిరోధక శక్తి ఉంటుందని తెలియపరిచారు. రేపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మీ మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో ప్రస్తుతం అమలవుతున్న పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రైతుల అడిగిన పలు సందేహాలను సైంటిస్టులు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మొహమ్మద్ ఫరూక్, మార్కెట్ యార్డ్ చైర్మన్ మతి అనురాధ భాస్కరరావు, గూడవల్లి సొసైటీ చైర్మన్ ఆలపాటి నరేంద్ర ,రేపల్లె మండలం వ్యవసాయ అధికారి మహేష్ ,నగరం ఏవో రమేష్ తదితరులున్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

విశాలాంధ్ర - యద్దనపూడి : చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సుజాత అన్నారు. పోషణ మహా కార్యక్రమం మండలంలోని గన్నవరం గ్రామంలో ఎస్సీ కాలనీలోని ఎంపీపీ స్కూల్‌లో నిర్వహించారు . ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పోపూరి సునీల్ కుమార్ మాట్లాడుతూ , చిన్నవారైనా సరే వారి యొక్క శరీరాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుకోవాలంటే వారి వయసుకు తగిన బరువు ఉండేటట్టు చూసుకుంటూ ఆరోగ్యకరమైన ఆహారం తీసుకొని అందరూ ఆరోగ్యకరంగా ఉండాలని తెలియ పరచినారు. ఆరోగ్య శాఖ వారు పిల్లల యొక్క బరు వులు , ఎత్తు చూసి తల్లులకు అవసరమైన సలహాలు తెలియజేశారు. ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు ఆర్. ఏసమ్మ, ఆర్ . రాజేశ్వరి,అంగన్‌వాడీ కార్యకర్తలు పి ఝాన్సీ, పి సునీత, పి హేమలత తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియా వినియోగంతో ప్రయోజనాలు

విశాలాంధ్ర - నిజాంపట్నం : రైతులు సాంప్రదాయ యూరియాకు బదులుగా నానో యూరియాను వినియోగిస్తే పంటలకు విస్తృత ప్రయోజనాలు కలుగుతాయని మండల వ్యవసాయ అధికారి చుక్కా విజయరాజు అన్నారు. గురువారం నిజాంపట్నం - 3 సచివాలయం ఆవరణలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) వారి సౌజన్యంతో నానో యూరియాపై రైతులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ యూరియా వాడకాన్ని తగ్గించి నానో యూరియా వాడకంకు అలవాటు పడాలని సూచించారు. నానో యూరియాతో మొక్కలకు నేరుగా నత్రజని పోషకం అందుతుందని, దీంతో మొక్కలు ఎక్కువగా పెరగడంతో పాటు భూమిలో నత్రజని స్థిరీకరించబడిపోవడం లేదా వృథా కావడం వంటి నష్టాలు ఉండవని తెలిపారు. కేవలం అర లీటరు నానో యూరియా పిచికారి చేస్తే సరిపోతుందని, దానివల్ల పంటల దిగుబడి పెరుగుతుందని రైతులకు వివరించారు. అలాగే మండలంలో రైతులకు సరిపడ యూరియా నిల్వలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. యూరియా అవసరమయ్యే రైతులు తమ సమీప రైతు సేవా కేంద్రాలలో వీఏఏ లను సంప్రదించి యూరియాను తీసుకు వెళ్ళొచ్చని రైతులకు సూచించారు. అనంతరం యూరియా పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టి రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానం

విశాలాంధ్ర - బాపట్ల : రక్తదానం ప్రాణదానంతో సమానం అని బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు అన్నారు. బాపట్ల ఏరియా వైద్యశాల అధ్వర్యంలో బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు, కార్యదర్శి మానం నాగేశ్వరావు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.వి రాఘవరావులు ప్రారంభించారు. ఈ వైద్యశిబిరంలో కళాశాల విద్యార్థులు, సిబ్బంది 40 మంది రక్తదానం చేశారు. అనంతరం ఉప యోగాలను ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజే శారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఎన్‌సీసీ విభాగంకు చెందిన అధ్యాపకులు జయ పాల్, కె. భవారి, వైపి ప్రసాద్, పీడీ రామారావు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

విశాలాంధ్ర - బేస్తవారిపేట : క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎంఈఓలు ఎన్ మధుసూదనరెడ్డి, సీవీ రమణారెడ్డిలు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి ఎస్ జీఎఫ్ క్రీడా పోటీలను ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లోనూ రాణించాలని, క్రీడలు మానసిక వికాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను డివిజన్ స్థాయికి, డివిజన్ స్థాయిలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి క్రీడలకు ఎంపిక చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ క్రీడా పోటీలకు మండల పరిధిలోని వివిధ పాఠశాలల నుండి 300 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటారు. బాలికల కబడ్డీ పోటీలో కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినిలు సత్తా చాటగా, బాలుర విభాగంలో బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు, వాలీబాల్ పోటీలో పిటికాయగుల్ల విద్యార్థులు ప్రతిభను చాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. శ్రీదేవి, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పీడీలు పాల్గొన్నారు.

గోవాడలో కిసాన్ గోష్టి కార్యక్రమం

విశాలాంధ్ర - అద్దంకి : సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులతోన అధిక దిగుబడులు సాధ్యమని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.రమేష్ అన్నారు. గురువారం మండలంలోని గోవాడ గ్రామం లో నిర్వహించిన కిసాన్ గోష్టి కార్యక్రమం లో భాగం గా ఆయన మాట్లాడుతూ ఎరువుల యాజమాన్యం గురించి వివరిస్తూ దుక్కి లో నత్రజని ఎరువులు వాడకం తగ్గించాలని,చివరి దుక్కి లో భాస్వరం ఎరువులు వాడుకోవాలని, భాస్వరం ఎరువులు వలన పంట వేరు వ్యవస్థ బాగా అభివృద్ధి చెందుతాయని వేరు వ్యవస్థ వృద్ధి చెందిన తర్వాత మాత్రమే మొక్క నత్రజని ఎరువులు తీసుకుంటుందని తెలిపారు. రెండు,మూడో దఫాలో మాత్రమే నత్రజని ఎరువులు వాడుకోవాలని సూచించారు. ఏడిఏ ఎఫ్రాయిం నానో యూరియా వాడకంతో ప్రయోజనాల గురించి తెలియజేశారు. ప్రతి రైతు ఈ పంట నమోదు చేసుకోవాలని ఏవో వెంకటకృష్ణ సూచించారు. బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు, వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : నూతనంగా మంజూరైన స్మార్ట్ రైస్ కార్డులను బాపట్ల మండలం అప్పికట్ల, ఈతేరు గ్రామాలలో బాపట్ల ఎమ్మార్వో షలీమా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బియ్యం, పిండి, పప్పులు, నూనె వంటి సరుకులు నేరుగా లబ్ధిదారులకు చేరుతాయని, అవినీతి లేదా మధ్యవర్తుల దోపిడీకి అవకాశం ఉండదని తెలిపారు.ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత కోసం ప్రభుత్వం ఈ కార్డులను అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు.

పాపాయిపల్లి పాఠశాలను ఎంఈవో-1 తనిఖీ

విశాలాంధ్ర - బేస్తవారిపేట : మండలంలోని పాపాయిపల్లి ప్రాథమిక పాఠశాల(నియర్ హెచ్‌ఎస్) ను ఎంఈఓ-1 నరెడ్ల మధుసూదనరెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఆయన మాట్లాడుతూ సీ గ్రేడ్ పిల్లలను ఏ గ్రేడ్ సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గొట్లగట్టులో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని గొట్ల గట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పాఠశాల గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి బాలికల క్రీడాకారుల ఎంపికను మండల విద్యాశాఖ అధికారి 2 బరిగా నరసింహారావు గురువారం ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల ప్రతిభను బట్టి ఎంపిక కార్యక్రమం పూర్తి చేయాలని వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి ఆదినారాయణ, నాయకులు పరిటాల సుబ్బయ్య, పొదిలి తిరుపతయ్య, మండల కోఆర్డినేటర్ ఉప్పుటూరు శ్రీనివాసులు ,వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం ఇవ్వాలి

విశాలాంధ్ర-పొన్నలూరు : మండలం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు పని దినాలను బట్టి ఫీల్డ్ అసిస్టెంట్లకు జీతాలు రావటం లేదని, కుటుంబాలు ఆర్థికంగా చాలా ఇబ్బందిగా ఉంటున్నాయని, ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనాలు పెంచాలని సంవత్సరం కాలం నుంచి పనిచేస్తున్నటువంటి ఫీల్డ్ అసిస్టెంట్లకు సిమ్ కార్డులు ప్రొవైడ్ చేయాలని గురువారం ప్రకాశం జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జోసెఫ్ కుమార్‌కు మండలం నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లు వినతిపత్రం అందజేశారు. మండల ఫీల్డ్ అసిస్టెంట్ల అధ్యక్షుడు సిహెచ్ సురేష్, మండల ఫీల్డ్ అసిస్టెంట్లు బి నారాయణ రెడ్డి,మల్లికార్జున, ఇశ్రాయేలు, కిషోర్, జై కిషోర్, జి మధు, శ్రీను, మహేష్ రెడ్డి వినతిపత్రం అందజేశారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేస్తే చర్యలు: సీఐ సురేష్

విశాలాంధ్ర - గిద్దలూరు : బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నిషేధమని అధికమిస్తే కఠిన చర్యలు తప్పవని గిద్దలూరు అర్బన్ సిఐ కే సురేష్ హెచ్చరించారు. గురువారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఆయా ప్రదేశాల్లో మద్యపానం చేస్తున్న ప్రదేశాలను గుర్తించి మద్యపానం తాగడానికి నిషేధిస్తున్నట్లు పేర్కొన్నారు. రాచర్ల రోడ్డు ముళ్లపాడు రోడ్డు మోటు రోడ్లలో నాలుగు కూడలిలో ఉన్న బెంచీల దగ్గర మద్యపాన నిషేధిస్తున్నట్లు తెలిపారు.

పశువుల బీడు భూమి ఆక్రమణ

విశాలాంధ్ర-సిఎస్ పురం : సిఎస్ పురం పంచాయతీలోని దర్శి తిమ్మక్కపల్లి రెవెన్యూ పరిధిలో గల పశువుల బీడు భూమిని కొంత మంది ప్రవేటు వ్యక్తులు ఆక్రమించుకున్నారని సి ఎస్ పురం పంచాయతీ వార్డు సభ్యులు మన్నేపల్లి కార్తీక్ నాయుడు మరియు దర్శి తిమ్మక్కపల్లి, ముండ్లపాడు పలువురు గ్రామస్తులు గురువారం మండల తహాశీల్దార్ కార్యాలయంలో తాహశీల్దార్ మహమ్మద్ హుస్సేన్‌కు వినతిపత్రం సమర్పించారు. దర్శి తిమ్మక్కపల్లి రెవిన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 186లో 123 ఎకరాలు 52 సెంట్ల విస్తీర్ణం గల ప్రభుత్వ పశువుల బీడు భూమి ఉంది. కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు అక్రమంగా ఆక్రమించుకున్నారని, జెసిబీల సాయంతో చెట్లు నరికి భూమిని చదును చేశారని తెలిపారు ప్రభుత్వానికి చెందిన పశువుల బీడు భూమి పశువులు మేపుకొనుటకు మాత్రమే అవకాశం కల్పించింది కానీ ఏ ఒక్కరూ హక్కు కలిగిఉండరు. కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకొని జెసిబి లతో చెట్లను తొలగించి చదును చేసి ఆక్రమించుకున్నారు తమ గ్రామ పశువుల జీవనాధారం ఈ భూమేనని, యాంత్రిక పరికరాలతో విస్తృతంగా ఆక్రమణ జరగడం ఆందోళన కలిగిస్తున్నదని పేర్కొన్నారు. ఆక్రమణ గురైన పశువుల బీడు భూమి సర్వే నిర్వహించి హద్దులు ఏర్పరిచి బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు ప్రజలు కోరారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలని ధర్నా

విశాలాంధ్ర - గిద్దలూరు : ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ గిద్దలూరు మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. గురువారం సిఐటియు ఆధ్వర్యంలో ఐ చంటయ్య అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి ఆవులయ్య మాట్లాడుతూ జులై మాసంలో ఐదు రోజులు ధర్నా చేసిన సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వం 17 రోజులు ధర్నా చేస్తే రిటైర్డ్ బెనిఫిట్ కల్పిస్తామని అరవై రెండు సంవత్సరాలు వయపరిమితి పెంచుతామని చనిపోతే వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని మరణిస్తే 7 లక్షలు ఇస్తామని చెప్పిన హామీలు అమలుకు నోచుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో కార్మికులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారని ప్రస్తుత కూటమి ప్రభుత్వం కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి పాపయ్య డి రంగయ్య ప్రవీణ్ కుమార్ పి కన్నయ్య మధు తదితరులు పాల్గొన్నారు.

చెత్తను సేకరించి వర్మి కంపోస్ట్‌గా మార్చాలి

విశాలాంధ్ర-కొండేపి : జిల్లా పంచాయతీ అధికారి యం.వెంకటేశ్వర రావు సూచన గ్రామాల్లో చెత్తను సేకరించి వర్మీ కంపోస్టుగా మార్చాలని పంచాయతీ అధికారులకు సిబ్బందికి జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు సూచించారు. కొండపి మండలం కె ఉప్పలపాడు గ్రామ పంచాయతీని గురువారం ఎం వెంకటేశ్వరరావు సందర్శించారు. గ్రామపంచాయతీ సిబ్బందితో మాట్లాడారు. గ్రామ పంచాయతీ లలో చెత్తను ఎప్పటికి కప్పుడు సేకరించి వర్మీ కంపోస్ట్‌గా మార్చాలని తడి చెత్త పొడి చెత్త గురించి ప్రజలకు అవగాహన తెలియజేసారు. ఐవిఆర్ఎస్ విలేజ్ లకు సంబంధించి ఫోన్ కాల్స్ గురించి గ్రామ ప్రజలకు అవగాహన తెలియజేసారు. జిల్లాలో, ప్రకాశం పారిశుధ్య పనులలో ముందు ఉండేలా పంచాయతీ అధికారు తగు చర్యలు తీసుకోవాలి అని గ్రామ పంచాయతీ సిబ్బంది కి సచివాలయం సిబ్బందికి సూచించారు. పారిశుద్యం గురించి గ్రామ ప్రజలకు అవగాహన తెలపాలని తెలియజేసారు. ఎస్ డబ్ల్యు పి సి షెడ్ బాగుండేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి లకు తెలిపారు.

ఎస్డబ్ల్యూపిసి షెడ్ తనిఖీ చేసారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి బి. రామాంజనేయులు, మండల రిసోర్స్ పర్సన్ అశోక్, డిప్యూటీ ఎంపీడీఓ అంజలీ దేవి, గ్రామ నాయకులు గుండపనేని రామూర్తి నాయుడు, పంచాయతీ కార్యదర్శి పుష్ప లత, సచివాలయం సిబ్బంది క్లాప్ మిత్ర తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయాలి

ఏపీ ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎర్రయ్య డిమాండ్

విశాలాంధ్ర-మార్కాపురం : డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో ముస్లిం జనాభా అధికంగా ఎ ఉన్నందున ఎక్కువ మంది విద్యార్థులు ఉర్దూ నేర్చుకోవాలని ఆసక్తితో ఉన్నారని, కావున ఉర్దూ పాఠశాల కు ఏర్పాటు చేయాలని ఏపీ ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు కె.ఎర్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ బాలికలు బాలురు పాఠశాలలో 150 మంది విద్యార్థులకు పైగా ఉర్దూ నేర్చుకుంటున్నారని, కావున ఆరో తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుకునే విద్యార్థులకు ఉర్దూ స్కూల్ ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సందర్భంగా ఆయనతో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఉర్దూ పాఠశాల కావాలని కోరడం జరిగింది. ఉపాధ్యాయులకు విద్యాబోధన తప్ప ఇతర బోధనేతర కార్యక్రమాలకు దూరంగా ఉంచాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు కె.ఎర్రయ్య కోరారు. పట్టణ శాఖ అధ్యక్షులు కే. ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాలు పంపిణీ

విశాలాంధ్ర-పెద్దారవీడు : మండల్ రిసోర్స్ సెంటర్ నందు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు డీలక్స్ సిపి చైర్, ట్రై సైకిల్ మరియు ఎల్బో క్లచ్చర్స్ ను ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం మరియు పెద్దారవీడు మండల క్లస్టర్ ఇంచార్జి జీవి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రగుంట నాగేశ్వరావు మరియు స్థానిక నాయకుల సమక్షంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రస్తుత ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తుందని, ప్రతి గురువారం మండల ఐఆర్టి సెంటర్ నందు డాక్టర్ పర్యవేక్షణలో ఫిజియోథెరపీ క్లాస్ నడుస్తుందని, అదేవిధంగా ఐఈఆర్టి సెంటర్కు తీసుకువచ్చే సి డబ్ల్యు చిల్డ్రన్స్కు ట్రాన్స్ పోర్ట్ అలవెన్స్ కల్పిస్తుందని, పింఛన్ సౌకర్యం కల్పిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాగేశ్వరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రత్యేక అవసరాలు గల పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి వారి బాగోగులు చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలోమండల టీడీపీ నాయకులు దొడ్డ బాస్కర్‌రెడ్డి, వెన్న సుబ్బారెడ్డి, బాలవర్ధిరాజు, బేబీ, జహీర్, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల మండలం దేవాంగపురి గ్రామ పంచాయితీ పరిధిలో తెలుగు దేశం పార్టీ చీరాల నియోజకవర్గ యువనాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్ స్మార్ట్ రైస్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత కోసం కూటమి ప్రభుత్వం స్మార్ట్ కార్డులను అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. ఇకపై బియ్యం, పిండి, పప్పులు, నూనె వంటి సరుకులు నేరుగా లబ్ధిదారులకు చేరుతాయని అన్నారు. అవినీతి జరుగకుండా, మధ్యవర్తుల దోపిడీకి అవకాశం లేకుండా నిత్యావసరాల పంపిణీ జరుగుతుందన్నారు.పంచాయతీలో పారిశుధ్య కార్మికులకు నూతన చెత్త సేకరణ వాహనాలను అందించారు. చీరాల మండల తహశీల్దార్ కె గోపీకృష్ణ, తెదేపా నాయకులు సిద్ది వెంకట బుచ్చేశ్వర రావు, కూటమి నాయకులు, మహిళలు, కార్యకర్తలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాలాజీకి అభినందనల వెల్లువ

విశాలాంధ్ర - చెరుకుపల్లి : కూటమి ప్రభుత్వం సాగిస్తున్న అరాచక పాలనతో ఇప్పటికే ప్రజలు విసిగిపోయి ఉన్నారని ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా టీడీపీకి డిపాజిట్లు కూడా దక్కవని రేపల్లె నియోజకవర్గం వైఎస్సీపీ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. రేపల్లె పట్టణానికి చెందిన క్రియాశీలక సభ్యుడు, యువ నాయకుడు చిమట బాలాజీకి రాష్ట్ర వైఎస్సీపీ జాయింట్ సెక్రటరీగా ప్రకటించిన సందర్భంగా గుళ్ల పల్లి క్యాంపు కార్యాలయంలో భారీ అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇచ్చిన వాగ్దానాలను విస్మరించి ప్రతిపక్ష నాయకుల పై దాడులు కేసులతో కాలయాపన చేస్తున్నారని ఆయన అన్నారు. రాష్ట్రంలో పరిపాలన గాడి తప్పి ఎర్ర బుక్కు పాలన నడుస్తుందన్నారు. పార్టీకి చెందిన ఏ ఒక్క నాయకుడు కార్యకర్త చెక్కుచెదరకుండా మొక్కవోని దీక్షతో మన నాయకుడిని తిరిగి గెలిపించుకునేందుకు అకుంఠిత దీక్షతో కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. ఈసారి ఎన్నికల్లో 151 నుంచి సీట్లు గెలిచి తిరిగి అధికారం చేపట్టడం ఖాయమన్నారు. చిమట బాలాజీ మాట్లాడుతూ ఇన్నాళ్లు పార్టీకి ఒక కార్యకర్తల పనిచేశానని ఇప్పుడు పార్టీ తనపై ఉంచిన బాధ్యతను నెరవేర్చేందుకు శక్తివంచన లేకుండా పార్టీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు. తనపై ఉంచిన బాధ్యత తనకు మరింత బాధ్యతను పెంచిందని నియోజకవర్గంలో వైఎస్సీపీ జండా ఎగరవేసేందుకు అహోరాత్రులు కృషి చేస్తానని ఆయన అన్నారు. అనంతరం పలువురు నాయకులు ఆయనను శాలువాలు పూలదండలతో అభినందనలు తెలిపారు. తొలుత నియోజకవర్గంలో ఎప్పుడూ లేనంతగా భారీ ర్యాలీతో రేపల్లె నుండి చెరుకుపల్లి వరకు కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. కార్లు, బైకులు, ఆటోలలో వచ్చిన కార్యకర్తలతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఐలాండ్ సెంటర్లో ఉన్న బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం సభాస్థలికి చేరుకున్నారు. బాణా సంచా వెలుగులతో పోలవరంతో ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైసిపి స్టేట్ సెక్రటరీ యార్లగడ్డ మదన్మోహన్, స్టేట్ ఎస్టీ సెల్ జనరల్ సెక్రెటరీ సజ్జ పద్మావతి, రేపల్లె పట్టణ కన్వీనర్ కరేటి శేషగిరిరావు, రేపల్లె రూరల్ కన్వీనర్ మేడికొండ అనిల్, నగరం, చెరుకుపల్లి, నిజాంపట్నం కన్వీనర్లు దుండి వెంకటరామిరెడ్డి, ఇంకొల్లు రామకృష్ణ, యార్లగడ్డ వెంకట రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు చదలవాడ శ్రీనివాసరావు, అధికార ప్రతినిధి కర్రి వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంచి ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : పిల్లల్లో ఉబకాయం తగ్గించాలంటే చిన్నప్పటి నుంచే మంచి ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలని సీడీపీఓ ఎం.అనసూయ సూచించారు.పల్లపట్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని నిజాంపట్నం - 1వ సచివాలయంలో గురువారం సీడీపీఓ ఎం.అనసూయ ఆధ్వర్యంలో "పోషణ మా" కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పిల్లల్లో ఉబకాయం నివారణపై తల్లితండ్రులకు అవగాహన కల్పించారు.సీడీపీఓ ఎం.అనసూయ మాట్లాడుతూ పిల్లల్లో ఉబకాయం పెరగడానికి తల్లిదండ్రులే అనుకోకుండా కారణమవుతున్నారన్నారు.పిల్లలకు జంక్ ఫుడ్ ఇచ్చే అలవాటు మానుకోవాలని అలాగే పిల్లలకు అతిగా తినిపించడం చేయరాదన్నారు. డాక్టర్ సాయి దీప్తి మాట్లాడుతూ తల్లితండ్రులు చిన్నప్పటి నుంచే పిల్లలకు సరైన ఆహారపు అలవాట్లు నేర్పిస్తే భవిష్యత్తులో వారు ఆరోగ్యవంతులుగా పెరుగుతారని తెలిపారు. డాక్టర్ సాయి కృష్ణ, టీ. సామ్రాజ్యం ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు.

బాపట్ల శాఖా గ్రంథాలయం
నూతన అభివృద్ధి కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల శాఖ గ్రంథాలయం నందు నూతన అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేశామని గ్రంథాలయాధికారి ఏ. శివాజీ గణేషన్ తెలిపారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బాపట్ల ఎమ్ఈఓ 2 డి .ప్రసాద్ రావు, ఏవివి స్కూల్ హెచ్ఎమ్ వై.సత్యవతి హాజరై సమావేశం గ్రంథాలయాధికారి ఏ.శివాజీ గణేషన్ అధ్యక్షత జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈఓ మాట్లాడుతూ గ్రంథాలయానికి సమాజంలో ఎంతో ప్రాధాన్యత ఉన్నదని ,గ్రంథాలయాల వల్ల నేటి యువత వారి జీవితంలో స్థిరపడటానికి ఎంతో ముఖ్య పాత్ర వహిస్తాయని అలాంటి వాటిని అభివృద్ధి పరచటానికి ఈ కమిటీ సభ్యులు చాలా ఉపయోగపడతారని గ్రంథాలయానికి ప్రథమ ప్రాధాన్యత నూతన భవనాన్ని ఏర్పాటు చేయటానికి ఈ కమిటీ ఎంతగానో తోడ్పడుతుందని ఆశాభావాన్ని వ్యక్తపరిచారు. గ్రంథాలయం ప్రెసిడెంట్ గా చాపల సుబ్రహ్మణ్యం,వైస్ ప్రెసిడెంట్ పి సి సాయి బాబు, సెక్రెటరీగా శేషాద్రి నాయుడు, జాయింట్ సెక్రెటరీగా బుర్లె రామసుబ్బారావు, కోశాధికారిగా కన్వీనర్ శివాజీ గణేషన్,అడ్వైజర్ గా న్యాయవాది కళ్లెం హరినాథ్ రెడ్డి,సభ్యులుగా వై.సత్యవతి, శ్యాముల్, జి .వెంకటేశ్వరరావు, బొమ్మిశెట్టి. శివరామకృష్ణ, సి.హెచ్ .ఉపేంద్ర, గంటా శంకర్రావు, శీలం శ్రీనివాసరావు, కె .నాగరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సాల్వేషన్ ఆర్మీ ఐ.టి.ఐ కళాశాలలో జాబ్ మేళా

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : సాల్వేషన్ ఆర్మీ ఐ.టి.ఐ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ,వారి ఆధ్వర్యంలో తేదీ 20వ తేదీన శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యం.మాదవి ఓ ప్రకటనలో తెలియచేశారు. ఈ జాబ్ మేళాకు అరబిందో లాబ్స్,ముత్తూట్ ఫినినస్, రిలైనస్ ట్రాండ్స్, వరుణ్ మోటార్స్, రాయల్ మెరైన్, టి. వి.యస్,టాటా ఎలెక్ట్రానిక్స్, యన్. యస్. యల్ టెక్సటైల్, కంపెనీలు హాజరవుతున్నాయన్నారు. జాబ్ మేళా నందు సూమారు 500కి పైగా ఖాళీలు ఉన్నాయని తెలియజేసారు. జీతం విద్యార్హతను బట్టి సుమారు రూ.12,000, నుంచి రూ.20,000లు వరకు ఉంటుందని తెలిపారు. ఈ జాబ్ మేళా కు ఎస్.ఎస్.సి, ఇంటర్, ఐ.టి.ఐ. డిగ్రీ, డిప్లొమా , ఎంబిఏ విభాగాల వరకు చదువుకున్న, నిరుద్యోగులు బయోడేటా లేదా రెస్యూమ్, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్ జిరాక్స్,ఆధార్ నకలు పాస్ పోర్ట్ ఫోటో తో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు.

గుట్టు చప్పుడుగా డిజిటల్ రైస్ కార్డుల పంపిణీ
ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : అధికారులు ప్రభుత్వానికి పేరు ప్రతిష్టలు తెచ్చే విధంగా డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ జరిపించక పోవటం బాధాకరమని ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు అన్నారు. సంచలనాత్మక మార్పులతో రైస్ కార్డుల విషయంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ రైస్ కార్డుల పంపిణీ నిర్ణయం హర్షణీయం అన్నారు. అయితే కొంత మంది అధికారులు మాత్రం ప్రభుత్వానికి ఆశించిన స్థాయిలో పేరు ప్రతిష్టలు రానీయకుండా నూతన డిజిటల్ రైస్ కార్డుల పంపిణీని గుట్టుచప్పుడు కాకుండా స్థానిక ప్రజా ప్రతినిధులకు సైతం తెలియజేయకుండా పంపిణీ చేయటం బాధాకరమని తెలిపారు. కర్లపాలెం మండలం ఇప్పటికి జరగక పోవడం చాలా బాధాకరమన్నారు.

స్థానిక సంస్థలను రాజ్యాంగ బద్ధంగా ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులను పక్కన బెట్టి ఎలాంటి సమాచారాలు తెలియజేయకుండా ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నట్లు ప్రవర్తిస్తున్న కర్లపాలెం మండలంలోని అధికారుల తీరు సరైంది కాదని తెలియజేశారు.

రైతులకు అందుబాటులో
366 మెట్రిక్ టన్నుల యూరియా: కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : రైతులు సాగు చేసిన పంటలకు సరిపడా యూరియాను వ్యవసాయ శాఖ రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం బాపట్ల జిల్లాలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆర్ఎస్ కెలు, పిఏసిఎస్ కేంద్రాల 18 ద్వారా 259.170 మెట్రిక్ టన్నుల యూరియాను 2075 మంది రైతులకు పంపిణీ చేయడం జరిగిందని, ఇంకా 366 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

మూలపాలెంలో స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేప పట్టిన స్మార్ట్ రైస్ కార్డ్ పంపిణీలో మూలపాలెం గ్రామంలో బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ పాల్గొని రైస్ కార్డులు పంపిణి చేశారు. మండలం లోని మూలపాలెం గ్రామంలో గురువారం నాడు స్మార్ట్ రైస్ కార్డ్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదలకు ఏపీ ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులు ఆగస్ట్ 25వ తేదీ నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు ప్రజాప్రతినిధుల తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 11 వరకు
రాష్ట్రీయ పోషణ్ మాహ్ 2025

విశాలాంధ్ర - వేటపాలెం : న్యూఢిల్లీ మిషన్ సాక్షం అంగన్వాడీ, మిషన్ పోషణ్ 2.0 కింద సుపోషిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడానికి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ నెలలో రాష్ట్రీయ పోషణ్ మాహ్ నిర్వహించబడుతున్నాయని ఈ క్రమంలో 8వ రాష్ట్రీయ పోషణ్ మాహ్ 2025 సెప్టెంబర్ 12 నుండి అక్టోబర్ 11 వరకు జరగనున్నాయని సిడిపిఓ తిరుమల శెట్టి ఝాన్సీ తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2018లో పోషణ్ అభియాన్ ప్రారంభించినప్పటి నుండి ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా ఏడుసార్లు విజయవంతంగా పోషణ్ మాసం నిర్వహించారని పేర్కొన్నారు. ఊబకాయం తగ్గించడం, చక్కెర, ఉప్పు, నూనె వినియోగాన్ని తగ్గించడం పోషణ్ పద్ధతీ (పిబిపిబి) కింద బాల్య సంరక్షణ విద్య (ఈసిసిఈ)తల్లి పేరు మీద ఒక చెట్టు నాటడం, శిశువులు, చిన్నపిల్లలకు సరైన ఆహారం (ఐవైసిఎఫ్) పద్ధతులు, మెన్-స్ట్రీమింగ్ ఈ కార్యక్రమాల ద్వారా వ్యక్తిగతంగా సమాజ స్థాయిలో ప్రవర్తనా మార్పును తీసుకువచ్చి మహిళలు, పిల్లల ఆరోగ్యం , శ్రేయస్సును పెంపొందించడం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సూపర్వైజర్ పుష్పవల్లి, ఏఎన్ఎం సునీత, న హెచ్ఎ ఏంజిల్ మహిళా పోలీస్ కరుణ, పిచ్చుక పుల్లయ్య, పృథ్వి సుబ్బారావు, కొలుకుల వరప్రసాద్ ,లలిత, బ్యూలా, మౌనిక, స్రవంతి, పద్మ, లక్ష్మి, పాల్గొన్నారు.